



హెలీప్యాడ్ ల్యాండింగ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

ముస్తాబవుతున్న పొన్నెకల్లు

- రేపు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాష్ట్రస్థాయి అంబేద్కర్ జయంతి వేడుకలకు సిద్ధం
- మార్గదర్శి-బంగారు కుటుంబాలతో సీఎం ముఖాముఖీ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడులకు తాడికొండ నియోజకవర్గంలోని పొన్నెకల్లు గ్రామం ముస్తాబవుతుంది. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. దీంతో గ్రామంలో అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీల మధ్యలో ముఖ్యమంత్రి సభా వేదికను నిర్ణయించిన అధికారులు ఇప్పటికే పనులు చేపట్టారు. అంబేద్కర్ వేడుకలకు సంబంధించి నాలుగు రోజులుగా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకల్లో పీ-4 కార్యక్రమాన్ని నిర్వహించి మార్గదర్శి-బంగారు కుటుంబాలతో సీఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. ఇందుకు సంబంధించి కూడా అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే హెలీప్యాడ్ పనులను పూర్తి చేశారు. అతిథితులకు, గ్రామస్తులకు భోజన ఏర్పాట్లకు ప్రత్యేకంగా టెంట్లను సిద్ధం చేస్తున్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కూడా చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆదివారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తి అవుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ శనివారం విలేకర్లకు తెలిపారు. శనివారం ఏర్పాట్లను ఆయన గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. శానిటేషన్, వాహనాల పార్కింగ్, బారికేడింగ్ పనులు సజావుగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీపీవో నాగసాయి, ఆర్అండ్‌బీ డీఈ బీ.చిన్నయ్య, తహసీల్దార్ మెహర్ కుమార్, ఎంపీడీవో సమతావాణి, ఈవోపీఆర్‌డీ సాయి లీల, పంచాయతీ సెక్రటరి జానీ పాల్గొన్నారు.

● సీఎం సభా ప్రాంగణం, హెలీప్యాడ్, అంబేద్కర్ విగ్రహం వద్ద పనులను శనివారం ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. సీఎం భద్రత సిబ్బంది, స్థానిక పోలీసులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.

పెరిగిన రబీ సాగు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్ సాగు విస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. వివిధ రకాల తృణ ధాన్యాల సాగు ఈ సీజన్‌లో 84 శాతం పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణంలో చెప్పుకోదగ్గ స్థాయిలో మార్పు కనిపిస్తుంది. రబీ సీజన్‌లో వరి 854 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా, 1093 హెక్టార్లలో సాగైంది. గత ఏడాది ఈ సీజన్‌లో కేవలం 330 హెక్టార్లలో మాత్రమే వరి సాగు చేశారు. జొన్న వాస్తవ విస్తీర్ణం 19130 హెక్టార్లు కాగా, 12999 హెక్టార్లలో సాగు చేశారు. 20386 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేయాల్సి ఉండగా 19879 హెక్టార్లలో సాగు చేశారు.గత ఏడాదితో పోలిస్తే 98 శాతం సాగు చేశారు. 54 హెక్టార్లలో మాత్రమే కంది పంట సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఆ అంచనాలను తారుమారు చేస్తూ ఏకంగా 241 హెక్టార్లలో సాగు చేశారు. పెసర వాస్తవ విస్తీర్ణం 10516 హెక్టార్లు కాగా, ఈ సీజన్‌లో 9858 హెక్టార్లలో సాగు చేశారు. మినుము 5833 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 8907 హెక్టార్లలో సాగు చేశారు.

అధిక ధర పలకడంతో

గత ఏడాది పొగాకు రేటు కొండెక్కింది. దాంతో ఈ ఏడాది పొగాకు సాగుకు ఎక్కువ మంది రైతులు ముందుకు వచ్చారు. రబీ సీజన్‌లో 924 హెక్టార్లకు 4465 హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్‌లో చాలా మంది రైతులు సాగుకు దూరంగా ఉన్నారు. తుఫాన్లు వస్తాయన్న ఆలోచనతో ఎక్కువ మంది ఎంటలు వేయలేదు.

ఇంటర్‌లో.. రెండో స్థానం

- రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన జిల్లా విద్యార్థులు
- సీనియర్లు 91, జూనియర్లు 82 శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది కంటే మెరుగైన ఫలితాల సాధన



వి కౌశిక్ ఎంపీసీ (992)



వినూత్న ఎంపీపీ (467)





సీనియర్ ఇంటర్ హాసిని, నాగశరణ్య బైపీసీ (989)

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. శనివారం మొదటి, రెండో సంవత్సర ఫలితాలను ప్రభుత్వం విడుదల చేయగా జిల్లా రెండో స్థానం దక్కించుకుంది. జిల్లా విద్యార్థులు గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో జిల్లాకి ఘనత సాధించారు. మార్చిలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 28,231 మంది హాజరుకాగా 25,646 మంది(91 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 32,613 మంది హాజరుకాగా 26,872 మంది(82శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంతో ఇంటర్ బోర్డు అధికారుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. 2022-23 విద్యా సంవత్సరంలో 68, 2023-24లో 81 ఉత్తీర్ణతశాతం నమోదు కాగా ఈ ఏడాది 91 శాతానికి ఎగబాకింది.

ఎంపీసీలో కౌశిక్ అగ్రస్థానం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వీ కౌశిక్ అనే విద్యార్థి 992 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీలో ఎల్ నవ్య, జీ హాసిని, వై నాగశరణ్య 989 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు ఎం వినూత్న అనే విద్యార్థిని 467 మార్కులతో, బైపీసీ విభాగంలో 440 మార్కులకు ఏ ప్రమోదలక్ష్మి 436 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు.

ఫలించిన నూతన ప్రభుత్వ సంస్కరణలు

ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం ఈ ఏడాది ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో మంచి ఫలితాలు వచ్చాయి. హాజరుతో సంబంధం లేకుండా ఫీజు కట్టిన ప్రతి ఒక్కరూ పరీక్ష రాసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో అత్యధిక మంది విద్యార్థులు పరీక్ష రాశారు. దీంతో ఉత్తీర్ణతశాతం కూడా పెరిగింది. గతంలో ఫీజులు చెల్లించని విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసేవి. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు. ఈ నేపథ్యంలో ఈ ఏడు యాజమాన్యాలతో సంబంధం లేకుండా వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకుని పరీక్షకు హాజరయ్యేలా ప్రభుత్వం నూతన విధానం తీసుకు రావడంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాయగలిగారు.

మండిన రెంటచింతల

44.1 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

రెంటచింతల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంటచింతలగా పేరుగాంచిన రెంటచింతలలో శనివారం భానుడు భగ్గుమన్నాడు. తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతకు నిలయంగా ఉన్న రెంటచింతలలో శనివారం 44.1 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఈ వేసవిలో ఇదే అత్యధికగా నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటూ చెలరేగిపోయాడు. దీంతో ప్రజలు బయటకు రావాలంటే జంకారు. ఈ ఏడాది ఎండ తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి ఎక్కువగా మంచినీటిని తాగాలని, కాటన్ దుస్తులను ధరించాలని, ఎండ నుంచి రక్షణకు టోపీలను పెట్టుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి సూచించారు.



నిర్మానుష్యంగా ఉన్న రెంటచింతల ప్రధాన రహదారి

గోవుల మృతిపై రాజకీయాలా...?

శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి



రెంటచింతల,ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని ఎస్వీ గోశాలలో 100కు పైగా ఆవులు మృతి చెందాయంటూ తప్పుడు ప్రచారాలు చేస్తూ రాజకీయం చేయడం దారుణమని శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి అన్నారు. శనివారం రెంటాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మనుషులకే రక్షణ లేకుండా పోయిందని మాస్కులు అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్ మృతి చెందడానికి కారణమయ్యారని దుయ్యబట్టారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరునితో రాజకీయాలు చేయడమంటే తమ పతనాన్ని తామే కొని తెచ్చుకుంటున్నారని అసత్య ప్రచారాలు చేయవద్దని హితవు పలికారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాన్నే కల్తీ చేసిన వ్యక్తులు ఇలాంటి ఆరోపణలు చేయడం నీచ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. తప్పు చేసిన వారిని శ్రీ వేంకటేశ్వరుడు వదిలి పెట్టరని వాస్తవాలు చర్చించేందుకు భూమన కరుణాకర్‌రెడ్డి ముందుకు రావాలని సవాల్ విసిరారు.పవిత్రమైన తిరుపతికి కరుణాకర్‌రెడ్డి అరిష్టంలా తయారయ్యారని దుయ్యబట్టారు. ఈమె వెంట పలువురు టీడీపీ నేతలున్నారు.

గురువుల మార్గనిర్దేశంతోనే ఉన్నతి

● పౌర సన్మానంలో కాకినాడ జేఎన్‌టీయూ వీసీ ● శివరామకృష్ణ ప్రసాద్‌కు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సత్కారం

అమృతలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎంతో మంది గురువులు నేర్పిన క్రమశిక్షణ, వారు అందించిన బోధన తన ఉన్నతికి దోహదపడ్డాయని కాకినాడ జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ చెరుకూరి శివరామకృష్ణ ప్రసాద్ చెప్పారు. ఇటీవల వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను శనివారం తాను చదువుకున్న స్కూల్‌లో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పౌర సన్మానం చేశారు. ప్రధాన రహదారి నుంచి శివరామకృష్ణ, పద్మావతి దంపతులకు మేళతాళాలతో రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఉపాధ్యాయుడు కె.నిరీక్షణరావు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ తల్లిదండ్రులు, బంధువుల ప్రభావం తనపై ఉందని, ఎక్కడ క్రమశిక్షణ వీడకుండా ఈ స్థాయికి చేరానన్నారు. విద్యార్థులంతా పట్టుదల, ప్రణాళికతో ముం దుకు వెళ్లి జీవితంలో అగ్రస్థానం చేరాలని చెప్పారు. విద్యార్థి దశలో కాలాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సి ఉందన్నారు. ఆయన తల్లిదండ్రులు వెంకటసుబ్బమ్మలకు ఈ సందర్భంగా పాదపూజ చేశారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు 1978-79 బ్యాచ్ విద్యార్థులు శివరామకృష్ణప్రసాద్, పద్మావతి దంపతులకు గజమాల వేసి పట్టువస్త్రాలు సమర్పించి ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్, ఎంటీసీసీ వల్లికారాణి, మదనమోహనరావు, వెంకటరత్నం, వినయ్ ప్రసంగించారు హైస్కూల్ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



వీసీ శివరామకృష్ణ ప్రసాద్, పద్మావతి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకృష్ణదేవరాయులుపై విమర్శలు చేస్తే ఊరుకోం

పిన్నెల్లిపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సుద్దపూస మాటలు ఆపు పిన్నెల్లి అంటూ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి విరుచుకుపడ్డారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి కాముకుడైన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులను అత్యంత అవినీతిపరుడు అని కబ్జాకోరైన రామకృష్ణారెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. పల్నాడు అభివృద్ధికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అహర్నిశలు పాటుపడుతుంటే ఆయనపై విషప్రచారం చేస్తూ బురద రాజకీయాలకు తెరతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుపై విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. జెర్రివాగు జలాలను రైతులకు ఇవ్వకుండా దగా చేసి స్వగ్రామమైన కండ్లకుంటలో నీటి వ్యాపారం చేసే నీవా శ్రీకృష్ణదేవరాయలును విమర్శించేది అని ప్రశ్నించారు. వరికపూడిశెల పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న నీవు సిగ్గు లేకుండా ఏ మొహం పెట్టుకుని రాజకీయం చేస్తున్నావని మండిపడ్డారు. మాచర్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజకీయాలు చేస్తున్నారని జూలకంటి అన్నారు. అనేక కేసులు, అవినీతి ఆరోపణలు ఎదు ర్కొంటున్న పిన్నెల్లి మాటలు విని రెచ్చిపోతే ఆయనతోపాటు నాయకులు సైతం జైలు పాలు కాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, బీసీ జిల్లా అధ్యక్షుడు మున్నా రాంబాబు, బూసా వేణు, వాసు, కొమెర శివ పాల్గొన్నారు.

అమరేశ్వరాలయం సహాయ కమిషనర్‌గా రేఖ



అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం సహాయ కమి షనర్‌గా కర్రెద్దుల రేఖ శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరిం చారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం రేఖ అమరేశ్వరాలయ సహాయ కమిషనర్‌గా నియమించబడింది. గతం లో ఇన్‌చార్జిగా పనిచేసిన పీ సునీల్‌కుమార్ తన మాతృసంస్థ అయిన దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహం కాళీ అమ్మవారి ఆలయంలో ఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన రేఖకు ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

దర్శకుల సృష్టి కోటప్పకొండ చిత్రం

◆ ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట కల్చరల్, ఏప్రియల్ 12 (ఆంధ్రజ్యోతి). దర్శకుల సృష్టి కోటప్పకొండ చిత్రమని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం రాత్రి స్థానిక భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరిగిన సినిమా ఓటీటీ సక్సెస్ మీట్‌లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కోటప్పకొండ స్థల పురాణాన్ని దృశ్య రూపంగా చిత్రీకరించిన దర్శకులను అభినందించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 25 లక్షల మంది వీక్షించడం రికార్డుగా పేర్కొన్నారు. సినీ దర్శకులు మా ఏపీ వ్యవస్థాపకులు దిలీప్ రాజా మాట్లాడుతూ తన దగ్గర శిక్షణ పొందిన తన శిష్యులు తొలి ప్రయత్నంగా నిర్మించిన ఈ చిత్రాన్ని 25 లక్షల మంది వీక్షించడం తనకు గర్వకారణమన్నారు. దీని వెనుక నటీనటులు, సాంకేతిక నిపుణుల కృషి ఎంతైనా ఉందన్నారు. తొలుత ఎమ్మెల్యే యూనిట్ బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దర్శకులు నరేష్ దోనే, మణివరన్, కోఆర్డినేటర్ రజియా, కాస్ట్యూమ్ డిజైనర్ పట్నాల పార్వతి, నటులు ఈదర అమర్‌నాథ్, నిర్మాత రావూరి సురేష్ బాబు పాల్గొన్నారు.

అమరావతికి అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం

చర్యలు తీసుకోవాలని ఎయిర్ పోర్ట్స్ శాఖ కార్యదర్శి ఆదేశం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో కొత్త అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం శరవేగంగా చర్యలు తీసుకుంటుంది. నూతన రాజధానిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు చేయా లన్న విజ్ఞప్తిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ పెట్టుబడులు, మౌలిక వసతుల, ఎయిర్ పోర్ట్స్ శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులను జారీ చేశారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు గత ఏడాది ఆగస్టు రెండో తేదీన అమరావతిలో అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీని కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన కేంద్ర ప్రభుత్వ విమానాశ్ర యాల శాఖ అండర్ కార్యదర్శి అమిత్ కుమార్ జా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ లేఖ నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని పెట్టుబడులు, మౌలిక వసతుల,ఎయిర్ పోర్ట్స్ శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ అమరావతి లో నూతన విమానాశ్రయం నిర్మితమైతే ప్రపంచ దేశాలకు చెందిన ప్రతినిధుల రాకపోకలు పెరుగుతాయన్నారు. దానివల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఎనలేని మేలు జరుగుతుందన్నారు.

గుంటూరు నుంచి నడిచి వచ్చి

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.కోటి విరాళంగా అందింది. విశాఖకు చెందిన మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మైనింగ్ కంపెనీ చైర్మన్ శ్రీనివాసరావు గుంటూరు నుంచి 12 రోజుల పాటు పాదయాత్రగా తిరుమలకు వచ్చి ఈ విరాళాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు శనివారం అందజేశారు.



టీటీడీ చైర్మన్‌కు డీడీ అందజేస్తున్న శ్రీనివాసరావు

ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య ప్రభంజనం

గుంటూరు (విద్య) ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు ప్రకటించిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎం వినూత్న 467, ఎస్.కె బుష్రా అంజుమ్, ఎస్.కె గౌస్ ఆజాం, కే శరణ్య కే శ్రీ నిధి పీ సౌమ్య తదితరులు 466 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 465 మార్కులకు పైగా 37 మంది 464 మార్కులకు పైగా 70 మంది, 460 మార్కులు పైగా 838 మంది, 450 పైగా మార్కులతో 2357 మంది, 400 పైగా మార్కులతో 5219 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ విభాగంలో ఏ రమ్య, ఏ గాయత్రి, ఆర్ గీతిక, టీ లీలాభవాని, సాయి వాసంతి, ఎం సుప్రజా, వి సంధ్య ,ఎస్.కె నఫీసా ,ఎం రత్నశ్రీ, ఆర్ తేజస్విని తదితరులు 435 మార్కులు సాధించారు. బైపీసీలో 430పైగా 154 మంది, 420 మార్కులకు పైగా 222మంది, 400 మార్కులకు పైగా పైగా 557 మం ది సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో టీ శరణ్య 991 మార్కులు ఆర్ చంద్రశేఖర్ 990, ఎం బాలాజీ, కే ప్రేరణ 989 మార్కులు, కే ఉషారాణి 988, శ్రీవిద్య 987 మార్కులు సాధించారు. 980పైగా 471 మంది, 970పైగా మార్కులు 815 మంది, 950పైగా మార్కులు 1752 మంది, 900 పైగా మార్కులతో 3915 మంది సాధించారని ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ విశ్లేషించారు. విద్యార్థులను డీన్స్ కిషోర్‌కుమార్, చంద్రశేఖర్, సురేష్‌కృష్ణ అసోసియేట్ డీన్ హరిబాబు తదితరులు అభినందించారు.



విద్యార్థులతో శ్రీచైతన్య ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తదితరులు

శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో జీ వంశీప్రియ, సీహెచ్ తన్మయి 491, కృష్ణచైతన్య 490, వై యుక్తయువరాణి 489, ఎంఎల్‌వీఎన్ యశస్విని 489, వై తన్వీశ్రీ, ఎస్ మేఘన 488, సీఈసీలో కే సర్వంత్ సైనా 458 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీలో ఆర్ యోమిత, ఎన్‌వీ కౌశికసాయి 979, వీజే సాయిశ్రీయ 975, కే వైసిల్య 972 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.



విద్యార్థులతో శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిషోర్

నారాయణ విజయభేరి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డీజీఎం శ్రీనివాసులురెడ్డి, కోర్ డీన్ తార్నాక చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470కి గానూ షేక్ కరిష్మా 466 మార్కులు సాధించారు. ఎండీ ఖయ్యూం, ఎస్‌వీ కార్తీక్, 465 మార్కులు సాధించారు. 464పైగా మార్కులు 42 మంది, 463 మార్కులకుపైగా 82 మంది, 462 మార్కులకుపైగా 111 మంది సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో సీహెచ్ మహాలక్ష్మి, ఎస్ తహసిన్, సీ సైమా 435 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 990పైగా ఒకరు, 989 మార్కులకుపైగా నలుగురు, 988పైన మార్కులు 5 మంది, సాధించారు. విద్యార్థులను డీన్లు వల్లభరావు, కోటేశ్వరరావు, మురళి, సుభానీ, ఏజీఎంలు హనుమంతరావు, రాజు, రామకృష్ణ రామారావు, ఆయా బ్రాంల ప్రిన్సిపాల్స్ వేద, రమాదేవి, సిహెచ్ శ్రీనివాస్ రవికాంత్, సురేష్, ఉపవాస్, జానీ, బాలకృష్ణ పవన్ తదితరులు అభినందించారు.



విద్యార్థులతో నారాయణ డీజీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00



హాస్టల్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

త్వరలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ప్రారంభిస్తాం

● హాస్టల్‌ను పరిశీలించిన తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో అన్ని సదుపాయాలు కల్పించామని, త్వరలో సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. స్థానిక బీసీ హాస్టల్‌ను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. హాస్టల్ నిర్మాణానికి తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.3 కోట్ల నిధులతో నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. అప్పట్లో సగం నిధులు విడుదల చేసి నిర్మాణాలు చేపట్టారని, అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా బీసీ హాస్టల్‌ను వదిలేసిందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని సీఎం చంద్రబాబు నాయుడు వద్దకు ఫైల్ తీసుకెళ్లానని తెలిపారు. బీసీ హాస్టల్ నిర్మాణానికి అవసరమైన రూ.1.45 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని కోరానని, దీనికి సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు. నిధులు విడుదల కావడంతో బీసీ హాస్టల్ నిర్మాణ పనులు కేవలం ఆరు నెలల్లోనే పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, వేములకొండ శ్రీను, వంగర ఏడుకొండలు, హఫీజ్, అబ్దుల్ సలీం, ముక్రం, చల్లా ఆంజనేయ ప్రసాద్, గుడిమెట్ల దయా రత్నం, గొడుగు శంకర్, బ్రహ్మసాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నామని, అన్ని ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పాత గుంటూరులోని అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో రూ.5 లక్షలతో నూతన బోరు ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం బోరు ఏర్పాటు చేయాలని స్థానికులు అడిగిన వెంటనే పనులు ప్రారంభించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలోనే కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ యిర్రీ ధనలక్ష్మి, జాగర్లమూడి శ్రీనివాసరావు, గాలి సతీష్ బాబు, అల్లం బాజీ, జ్యోతుల జస్వంత్, బట్ట రాజా, హేమంత్ గుప్తా, శ్రీను నాయక్, సుబ్బారావు, భాస్కర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందాలి

● తూర్పు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రధాని మోదీ లక్ష్యమని తూర్పు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. బీజేపీ ఆదేశాల మేరకు తూర్పు నియోజకవర్గ పరిధి, 6వ మండలంలో శనివారం గావ్ ఛలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ ధ్యేయంగా అంత్యోదయ సిద్ధాంతానికి కట్టుబడి బీజేపీ ఉందని అన్నారు. స్థానిక ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌ను సందర్శించి మౌలిక సదుపాయాలు, ఉచిత ఔషాదాల పంపిణి వంటి వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ముఖ్య ఔషధమైన స్టోరేజ్ రాక్స్‌ను 6వ మండల నాయకులు మైలవరపు ప్రవీణ్, వేమూరి అనిల్ సమకూరుస్తారని హామీ ఇచ్చారు. తొలుత నాజ్ సెంటర్‌లోని మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలతో ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి పవన్ కుమార్, సురేష్ కుమార్ జైన్, రామకృష్ణ, మోతె శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తదితరులు

నేటి నుంచి డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ అండ్ రీడింగ్ రూమ్, కొరిటెపాడు వేదికగా డాక్టర్ మురళీ మోహన్ కళారంగ ప్రస్థానం, గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి, వైకే నాగేశ్వరరావు నాటకోత్సవాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 16వ తేది వరకు డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు నాటకోత్సవ కమిటీ ఛైర్మన్ ఘంటా పున్నారావు, కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మెన్ గుమ్మడి గోపాలకృష్ణ, మైనార్టీ అఫైర్స్ సలహాదారుడు మహమ్మద్ అహ్మద్ షరీఫ్‌లను డాక్టర్ మాగంటి మురళీమోహన్ ఆత్మీయ పురస్కారాలతో సత్కరిస్తారన్నారు. 14న కనకపుష్యరాగం నాటకం, 15న మంత్రం నగరి నాటకం, 16న ప్రముఖ రంగస్థల నటుడు, జర్నలిస్ట్ ఫలతోటి జోసెఫ్‌కు అభినందన సత్కారం జరుగుతుందని వివరించారు.

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ (జీజేఎల్ఏ) జిల్లా కార్యవర్గ ఎన్నిక శనివారం నిర్వహించారు. ఎన్నికల కార్యక్రమానికి పర్యవేక్షకులుగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా, సూర్యదేవర శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా ఎస్.రత్నశేఖర్, ఉపాధ్యక్షుడిగా బి.లక్ష్మణరావు, కార్యదర్శిగా ఎం.వరహాచారి, సంయుక్త కార్యదర్శిగా డి.అనిల్ కుమార్, కోశాధికారిగా ఎల్.నూర్‌బాషా, మహిళా కార్యదర్శిగా ఎన్.మాధవిలత, స్టేట్ కౌన్సిలర్‌గా ఎస్.ఆశాజ్యోతిలను ఎన్నుకున్నారు. సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ నూతన కార్యవర్గ పదవి కాలం మూడు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.



ఐక్యత చాటుతున్న జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

మాకినేని ఆశయాలను కొనసాగించాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన మాకినేని బసవ పున్నయ్య ఆశయాలను నేటి తరం కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం మాకినేని బసవ పున్నయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైద్ధాంతిక విలువలు లేకుండా కార్పొరేట్ రాజకీయాలు చేస్తున్న నేపథ్యంలో మాకినేని బసవపున్నయ్య లాంటి నేతల ప్రాధాన్యత ప్రజలకు తెలపాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో నళినీకాంత్, సి.వెంకట్రావు, కుమార్, మోహనరావు, కృష్ణకాంత్, కిరణ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుల జాతి గుండెచప్పుడు ఏకలవ్యుడు

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

● ఘనంగా ఏకలవ్య విగ్రహావిష్కరణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఏకలవ్యుడు ఎరుకల సామాజిక వర్గంలో ఉద్భవించటం ఆ సమాజానికి, వర్తమాన భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక అమరావతి రోడ్డులో ఏకలవ్యుని విగ్రహావిష్కరణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధర్మానికి కట్టుబడిన యోధుడు ఏకలవ్యుడు అని అన్నారు. నగర ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎరుకల సమాజ సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు.



రాజకీయంగా గిరిజనుల ఎదుగుదలకు సంఘటితంగా వర్గాలకతీతంగా కలిసికట్టుగా నడవాలని కోరారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ గిరిజనుల రిజర్వేషన్లు ఆరు శాతం రాష్ట్రవ్యాప్తంగా కచ్చితంగా అన్ని స్థాయిలలో అమలు చేసేలా కృషి జరగాలన్నారు. సభకు అభివృద్ధి సంఘం అధ్యక్షులు మేడా లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విజయవాడ ఏఎస్పీ కుంభ కోటేశ్వరరావు, సంఘ సభ్యులు ఉయ్యాల వెంకటేశ్వర్లు, తోకల పాపారావు, మేడ బ్రహ్మయ్య, తోకల రామకృష్ణ, కుంభ ఏడుకొండలు, మేడా హనుమంతురావు, స్థానిక కార్పొరేటర్ నూకవరపు బాలాజీ పాల్గొన్నారు.

ఏకలవ్యుని విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యేలు రామాంజనేయులు, గళ్లా మాధవి, నసీర్ అహ్మద్



మురుగు కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

డ్రెయిన్లలో పూడికతీత పనులు వేగవంతం చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ప్రధాన ఔట్‌ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనులు వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా శనివారం విద్యానగర్, నగరాలు, గోరంట్ల, రెడ్డిపాలెం తదితర ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య పనులను, ప్రధాన డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు, భవన నిర్మాణ అనుమతులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. రానున్న వర్షాకాలం రాకముందే నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లలోని డ్రెయిన్లలో పూర్తి స్థాయిలో పూడికతీత పనులు పూర్తి చేయాలన్నారు. నగర పాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలు జరగాలని, అనుమతి పొందిన ప్లాన్ డీవియేషన్ అయితే ఓ.సిలకు అనుమతి ఇవ్వడం జరగదన్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు అనధికార నిర్మాణాలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ఏసీపీ రెహమాన్, ఎస్ఎస్‌లు సోమశేఖర్, ఐజాక్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయంలో ఆహారం అందించాలి

అన్న క్యాంటీన్లలో ప్రతి రోజు నిర్దేశిత సమయంలో ఆహారం అందించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందికి స్పష్టం చేశారు. బస్టాండ్ వద్ద గల అన్న క్యాంటీన్‌ని శనివారం ఆయన పరిశీలించారు.

జర్నలిస్టులకు రైల్వే పాస్ రాయితీని పునరుద్ధరించాలి

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు రైలు ప్రయాణ ఛార్జీలలో 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకులు గుంటూరు రైల్వే నూతన డీఆర్ఎం సుధేష్ణ సేన్‌కి విజ్ఞప్తి చేశారు. రైల్ వికాస్ భవన్‌లో యూనియన్ నాయకులు శనివారం డీఆర్ఎంని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ ముందు వరకు జర్నలిస్టులకు రైలు ప్రయాణంలో రాయితీ ఉండేదన్నారు. కోవిడ్ కారణంగా తాత్కాలికంగా జర్నలిస్టులు ఇస్తున్న రాయితీని ఆపేశారని చెప్పారు. కోవిడ్ తర్వాత ఇప్పటివరకు పునఃప్రారంభించలేదన్నారు. తమ సమస్యని రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా యూనియన్ కార్యదర్శి కె.రాంబాబు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలి

● ఎక్సైజ్ శాఖ ఏఈ మారయ్య బాబు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తు పదార్థాలకు ప్రజల దూరంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ గుంటూరు ఏఈ ఎస్.మారయ్య బాబు తెలిపారు. గంజాయి తదితర మత్తు పదార్థాల నిర్మూలన గురించి అవగాహన కార్యక్రమం, ర్యాలీని పొన్నూరు రోడ్డులోని హౌసింగ్ నగర్ ప్రాంతంలో శనివారం నిర్వహించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాల గురించి, గంజాయి/ మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగాన్ని నిర్మూలించడానికి తీసుకోవలసిన నివారణ చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలోని ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు-1 ఎక్సైజ్ స్టేషన్ సీఐ లత, ఎస్ఐలు షరీఫ్, తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం



లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆర్ అగ్రహారంలోని రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఎమ్మెల్యే గళ్లా మాధవి స్వయంగా రథం లాగి రథోత్సవాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ అతి పురాతన చరిత్ర గల లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని, ఆ స్వామి దయతో ప్రభుత్వం జనరంజక పాలన సాగిస్తునందన్నారు. గుంటూరు 28వ డివిజన్ ఎన్జీవో కాలనీలో శ్రీ గంగా పార్వతి సమేత ఉమా మహేశ్వరి దేవస్థాన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్లా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెల్లగొర్ల అప్పారావు, నల్లూరి శ్రీను, మామిడి రామారావు, చిరంజీవి, శివాజి పాల్గొన్నారు.

హనుమాన్ మండల వ్రత దీక్షలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతి నగర్, శ్రీ మారుతీ దేవాలయ ప్రాంగణంలో చైత్ర శుద్ధపౌర్ణమి సందర్భంగా హనుమాన్ మండల వర్తదీక్షలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గురుస్వామి చేతుల మీదగా పలువురు దీక్షాపరులు ఆంజనేయ స్వామి మాలధారణ ధరించారు. కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ మాట్లాడుతూ మండల దీక్షలు మే 25 వరకు ఉంటాయని, హనుమత్ జయంతి నుంచి నాలుగో రోజున హనుమత్ హోమం, మాల విసర్జన జరుగుతుందన్నారు. అర్ధమండల దీక్షలు మే 1 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

వైభవంగా శ్రీ రాధా, గోవిందుల వార్షికోత్సవం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామలానగర్, తొమ్మిదో లైన్‌లోని శ్రీ రాధా గోవిందుల మందిరం పంచమ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా శ్రీ రాధా గోవిందుల పంచామృత అభిషేకం, పుష్పాభిషేకం, నూతన వస్త్రాలంకరణం, మహా నైవేద్యం, హారతి, మహా ప్రసాదం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ మధ్భక్తి ప్రసాద్ సజ్జన్ మహారాజ్, సేవా బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

వడగాడ్పులు ప్రారంభం

● పెదనందిపాడుతో పాటు మరో నాలుగు మండలాల్లో ప్రభావం

● 41 డిగ్రీల సెల్సియస్ దాటుతున్న ఉష్ణోగ్రతలు

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వీచే వడగాడ్పులు ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే వచ్చేశాయి. ఏటా మే నెలలో వడగాడ్పుల ప్రభావం జిల్లాలోని కొన్ని మండలాల్లో ఉండేది. అలాంటిది శనివారం (ఈనెల 12వ తేదీ) జిల్లాలోని పలు మండలాల్లో వడగాడ్పులు వీచాయి. తీవ్ర వడగాడ్పులు పెదనందిపాడులో నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొన్నది. దీంతో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయింది. అలానే చేబ్రోలులో 40.7, కాకుమానులో 41.9, పొన్నూరులో 41.9, తాడేపల్లిలో 41.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఇక ఆదివారం జిల్లాలోని అన్ని మండలాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. తాడేపల్లి, తుళ్లూరులో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత దాటే అవకాశం ఉందని పేర్కొన్నది. వడగాడ్పుల దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో ఎండ వేడిమితో పాటు వడగాడ్పులు వీచ్చే అవకాశం ఉంది కావున మరింత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది.

రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 13, 14వ తేదీల్లో జరిగే ఏపీ స్టేట్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు ఎంపికయ్యారని టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. వీఎస్ఎస్ లలిత్, ఎస్.చరణ్ కుమార్, వి.హర్షినిలు జిల్లా జట్టు నుంచి పాల్గొంటారని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పతకాలు సాధించి జిల్లా కీర్తి ఇనుమడింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా కోచ్‌లు కె.అరుణ్ కుమార్, పి.ఆనంద్ కుమార్, లెనిన్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

బైక్ చోరీల కేసులో నిందితుడి అరెస్టు

● 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధి లోని మోటార్ సైకిల్ దొంగతనం కేసులలో పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన కోట అనిల్‌కుమార్‌ని పోలీసులు అరెస్టు చేసారు. నిందితుని వద్ద నుంచి సుమారు రూ.12 లక్షలు విలువ గల 20 మోటర్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. గుంటగ్రౌండ్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు అనిల్‌కుమార్ అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తూ రైలుపేట రెండో లైన్‌లో తన స్నేహితులతో కలసి రూమ్ అద్దెకు తీసుకొని నివసిస్తూ మద్యం వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. డెలివరీ బాయ్ గా పని చేయగా వచ్చిన డబ్బులు చెడు వ్యసనాలకు చాలక ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలని మోటార్ సైకిళ్ళను చోరీ చేయడం ప్రారంభించాడు. కొత్తపేట, అరండల్‌పేట, పాత గుంటూరు, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో పలు చోట్ల పలు మోటార్ సైకిళ్ళు దొంగిలించి వాటిని అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలు చేసాడు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీఐ వీరయ్య చౌదరి పర్యవేక్షణలో, కొత్తపేట ఎస్సైలు రమేష్ , హనుమంతరావు, సుబ్బారావు, సిబ్బంది సహాయంతో రైల్వేస్టేషన్ ఆగ్నేయ భాగంలో గల రైల్వే క్వార్టర్స్ ఎంట్రన్స్ రోడ్డు వద్ద నుంచి 12 లక్షలు విలువ గల 20 మోటర్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

పరీక్ష ఫలితాలు వచ్చే కొద్ది గంటల ముందు ఇంటర్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా కాలనీ 27వ లైను కి చెందిన గడ్డం అఖిల్ (17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ పరీక్షలు రాసాడు. పరీక్షల ఫలితాలు విడుదల నేపథ్యంలో శనివారం ఉదయం 5 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్ళ వద్ద వెతికినా అఖిల్ ఆచూకీ దొరకలేదు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులు తెలిపారు. అఖిల్ ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



సుమారు 40 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి కొంతకాలంగా అమరావతి రోడ్డులోని కావేరీ హోటల్‌లో పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి శ్రీనగర్ సిగ్నల్స్ పాయింట్ దగ్గర పడి పోయి ఉన్నాడు. అపస్మారక స్థితిలోకి వెళ్ళి కొద్ది సేపటికి అక్కడే చనిపోయినట్లు మెకానిక్ షాపు మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసి వారు అరండల్‌పేట పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.



విద్యార్థుల్ని అభినందిస్తున్న డైరెక్టర్ రోహిణీదేవి తదితరులు

ఇంటర్ ఫలితాల్లో అభ్యుదయ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ బీఎస్ఆర్‌కె ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఉత్తమ ఫలితాలు విద్యార్థులు సాధించారని వివరించారు. ఎన్.దేవి 462 మార్కులు, టి.ఈషిత 461, వై.దక్షిణ 459, బి.నాగేశ్వరి 452, వై.దామిని 429 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో కె.లుధియా 973, బైపీసీలో ఎన్.వేద 952, సీఈసీలో ఎస్‌కె ఆయేషా 923 మార్కులు సాధించారు. విద్యార్థినుల్ని మరో డైరెక్టర్ రోహిణిదేవి తదితరులు అభినందించారు.

ఆర్క విద్యార్థులు...

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో ఆర్క జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్లు వెంకట ప్రసాద్, మల్లికార్జునరెడ్డి, అనిల్‌కుమార్, వాసుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో సీహెచ్ వెంకటలక్ష్మీరూప 465 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇంకా 460పైగా మార్కులతో 18మంది, 450పైగా మార్కులతో 35 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో బి.రూపేశ్వరి బాయి, నఫ్రీన్‌నైలా 435 మార్కులు సాధించారు. ఇంకా సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సీహెచ్ శ్రీగాయత్రి, పి.యశస్విని 989 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో డి.అక్షయరెడ్డి 989 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను డీన్ శ్రీనివాస్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు వెంకటప్రసాద్,మల్లికార్జునరెడ్డి తదితరులు

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు...

గుంటూరు(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ జి.సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 502 మంది విద్యార్థినులకుగాను 261 మంది(52శాతం), ద్వితీయ సంవత్సరంలో 401 మంది విద్యార్థినులు పరీక్ష రాస్తే 293 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కళాశాల విద్యార్థిని పఠాన్ తన్వియ సల్తానా ఎంపీసీలో 978 మార్కులు సాధించినట్లు తెలిపారు. మరో విద్యార్థిని ఎండీ ఆఫిసా తబసమ్ బైపీసీలో 965 మార్కులు, దీపిక 963, సీఈసీలో మనీషాకుమారి 952 మార్కులు, ఎంఈసీలో రాజేశ్వరి 967 మార్కులు సాధించారని వెల్లడించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో వెంకటశివలావణ్య 456, రెహన్‌కేసర్ 452 మార్కులు సాధించారు. అదేవిధంగా సీఈసీలో ఎండీ సాన్య 471, ఎంఈసీలో దివ్యశ్రీ 434, బైపీసీలో సుష్మ 425, డి.సారిక 416, ఎండీ హజరా సాజిత 408 మార్కులు సాధించినట్లు వివరించారు. తమ విద్యార్థులు 46 మంది 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారని అన్నారు. విద్యార్థినుల్ని అధ్యాపకులు అభినందించారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గోరంట్ల సమీపంలోని ఇన్నర్ రింగ్ రోడ్‌లో భాష్యం రామసేతు వెనుక గల, రెండు తెలుగు రాష్ట్రాల్లో వంద పడకలతో అతి పెద్దదైన ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం జరుగుతుందని ప్రముఖ కేరళ ఆయుర్వేదిక్ వైద్య నిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పంచకర్మ చికిత్సల్లో అనుభవజ్ఞులైన వైద్య బృందంచే నాడీ పరీక్షించి కీళ్ల నొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా, లైంగిక సమస్యలు, పక్షవాతం, స్పాండిలైటిస్, సొరియాసిస్, చర్మవ్యాధులు, అధిక బరువు, మోకాళ్ల అరుగుదల, పైల్స్, జీర్ణ సంబంధిత వ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులు, నరాలు, వెన్నుపూస సంబంధిత వ్యాధులు, హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడే రోగులకు ఉచితంగా మందులు అందజేస్తామని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయం దిక్సూచి

● రూ. లక్ష పెట్టుబడి.. రూ. 4 లక్షల ఆదాయం ● గుంటూరు జిల్లాలో శ్రీనివాసరెడ్డి సక్సెస్ స్టోరి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) సాంప్రదాయ వ్యవసాయానికి భవిష్యత్తు లేదని, ప్రకృతి వ్యవసాయం పైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన రైతు కళ్ళం శ్రీనివాసరెడ్డి నిరూపిస్తున్నారు. భూములను లోతుగా దుక్కులు చేయడం వల్ల భూసారం పూర్తిగా తగ్గిపోతోందని, మితిమీరిన రసాయన ఎరువుల వినియోగం కారణంగా భూమిలోని సూక్ష్మజీవులు ఒక్కొక్కటిగా నశించి సేంద్రియ కర్బనం పూర్తిగా ఆవిరైపోతుందని, ఈ విధానం పంట దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తూ రైతులను నష్టాల్లోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

44 ఏళ్ల వ్యవసాయ అనుభవం కలిగిన శ్రీనివాసరెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలను గడిస్తున్నారు. ఆయన కథ ఏమిటో ఒకసారి తొంగిచూద్దాం. శ్రీనివాస్ రెడ్డి రసాయనిక వ్యవసాయం చేస్తున్న తరుణంలో రసాయన మందుల ఖర్చు అత్యధికంగా ఉండేది. పురుగు, తెగుళ్ల నివారణ కోసం రైతుల మధ్య విభిన్న మందుల సూచనలు ఉండేవి. కానీ అవి ఆశించిన ఫలితాన్ని ఇచ్చేవికావు. ఫలితం లేదని దుకాణాల వద్దకు వెళ్లినప్పుడు మరో రకం రసాయనం వాడాలని సూచించడంతో ఖర్చులు పెరిగి గిట్టుబాటు ధర లేక నష్టాలు ఎదురయ్యేవి.

శ్రీనివాస్ రెడ్డి తెల్ల మొక్కజొన్న, అరటి, చామ వంటి పంటలు వేశారు. ఆయా పంటలకు యూరియా 266 కేజీలు, పోటాష్ 1750 కేజీలు, డి.ఎ.పి 1700 కేజీల మేర వినియోగించారు. మొత్తం వ్యయం ఎకరానికి దాదాపు రూ.25 వేల వరకు అయ్యింది. దానికి తోడు, పురుగు, తెగుళ్ల నివారణ కోసం రసాయన పురుగుమందులు మూడు నుంచి నాలుగు సార్లు పిచికారీ చేసేవారు. అధిక పెట్టుబడుల వల్ల నష్టాలు వాటిల్లేవి.

రైతు సాధికార సంస్థ శిక్షణలతో ప్రకృతి వ్యవసాయంలోకి..

2018 సంవత్సరంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, ప్రకృతి వ్యవసాయం గురించి శ్రీనివాసరెడ్డి అవగాహన


ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కంద గడ్డల పంటతో రైతు శ్రీనివాస రెడ్డి

పెంచుకున్నారు. అయితే రసాయనిక వ్యవసాయంలో వచ్చినంత దిగుబడి ప్రకృతి వ్యవసాయంలో వస్తుందా .. రాదా.. అనే సంశయంతో తొలుత ముగ్గురు అన్నదమ్ములు ఒక్కొక్కరు అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంలో మానవ శ్రమ... ప్రాధాన్యం

మొదటగా 7 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించినప్పుడు, అధిక సంఖ్యలో కూలీల అవసరం ఏర్పడింది. ముఖ్యంగా, ఘన, ద్రవ జీవామృతం తయారు చేసి వేయడానికి ఖర్చులు అధికంగా ఉండేవి. ప్రారంభ దశలో ఎకరాకు 30 నుంచి 40 బస్తాల ఘన జీవామృతం ఉపయోగించేవారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సూచన మేరకు భూమిలో తేమ ఉన్నప్పుడు జీవామృతాలను ప్రయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని గుర్తించారు. అయితే తేమ ఉన్న సమయంలో పొలంలో ఉపయోగించేందుకు మానవ శ్రమ అధికంగా అవసరమయ్యేది. 2018 నుంచి మూడు సంవత్సరాల పాటు ఘన జీవామృతం వినియోగించారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానం అనుసరిస్తున్నారు. ఆసక్తికరంగా ఘన జీవామృతం వాడిన భూమిలోనూ, ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ వాడిన భూమిలోనూ దాదాపు సమానమైన దిగుబడి వచ్చిందని గుర్తించారు. అయితే ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ వాడిన భూమిలో కలుపు తక్కువగా ఏర్పడిందని అనుభవంతో వెల్లడైంది.

ఈ అనుభవం ఆధారంగా, తర్వాతి దశలో మొత్తం పొలంలో ఘన జీవామృతం ఉపయోగించడాన్ని విరమించుకున్నారు. దాని స్థానంలో, దాదాపు 30 రకాల పచ్చిరొట్టి పంటల విత్తనాలు విత్తారు. పచ్చిరొట్టి పంటలను నేరుగా భూమిలో కలియ దున్నకుండా కోసి భూమిపై పరచి ఉంచడం వల్ల వానపాములు, సూక్ష్మజీవులు పెరిగి, పంటలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభించాయి. ఈ ప్రక్రియ వల్ల, భూమి గుల్లబారి, పంటలు ఆరోగ్యంగా పెరిగే అవకాశం లభించింది.

గణనీయమైన దిగుబడి

2022-23 సంవత్సరంలో అరటి,పసుపు సాగు చేసేందుకు ఖర్చు రూ..1,02,000 కాగా, అరటి 250 క్వింటాళ్ల దిగుబడి తో ఆదాయం రూ. 4,98,000 వరకు వచ్చింది. పసుపు 25 క్వింటాళ్ల దిగుబడి తో ఆదాయం రూ.3,96000 వరకు రావడం జరిగింది. 2023-2024 సంవత్సరంలో అరటి,పసుపు సాగు చేసేందుకు ఖర్చు రూ.1,02,000 వరకు కాగా,అరటి 255 క్వింటాళ్ల దిగుబడితో రూ.4,64,250 ఆదాయం రావడం జరిగింది. పసుపు 25 క్వింటాళ్ల దిగుబడితో రూ.3,62,250 ఆదాయం వచ్చింది. 2024-25 సంవత్సరంలో అంచనాల ప్రకారం అరటి, పసుపు సాగు కు రూ.1,02,000 ఖర్చు అయ్యింది. అరటి 255 క్వింటాళ్ల దిగుబడితో రూ.5,09,250 ఆదాయం వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. పసుపు 25 క్వింటాళ్ల దిగుబడితో రూ. 4,07,250 ఆదాయం వస్తుందని అంచనా.

నేరుగా మార్కెటింగ్... వినియోగదారులకు లాభం

శ్రీనివాస్ రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలు అధిక నాణ్యత కలిగి ఉండటంతో, వ్యాపారస్తులు, వినియోగదారులు నేరుగా పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ విధానం మధ్యవర్తుల వ్యవస్థను తొలగించి అధిక లాభాలను రైతులకు అందించడంతో పాటు కొనుగోలుదారులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను చౌక ధరలకు పొందగలుగుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో జీవఆచ్ఛాదనం (పచ్చిరొట్టి ఎరువులు) పాటించడం వల్ల కలుపు నివారించగలిగారు. వివిధ రకాల పంటలను వేయడం వల్ల పురుగులు మరియు తెగుళ్ల ప్రభావం తగ్గడమే గాకుండా పూర్తిగా నివారించగలిగారు.

ఉత్తమ రైతు అవార్డు అందుకున్న శ్రీనివాసరెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీనివాసరెడ్డికి "ఉత్తమ రైతు అవార్డు" ప్రదానం చేసింది. మిల్లినియం అవార్డుతో పాటు సంక్రాంతి రైతు సదస్సు సందర్భంగా ముప్పారపు ఫౌండే షన్ నుంచి "ఉత్తమ రైతు అవార్డు"ను అందుకున్నారు.

పది జిల్లాల రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి...

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఎంతో మంది రైతులు క్రమం తప్పకుండా శ్రీనివాసరెడ్డి సలహాలు, సూచనలు తీసుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. శ్రీనివాసరెడ్డి తన ప్రయోగాలు, పట్టుదల, సృజనాత్మకతతో వ్యవసాయంలో కొత్త ఒరవడిని సృష్టించి ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను ప్రామాణికంగా చూపించగలుగుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో అనేక మంది రైతులకు మార్గదర్శకుడిగా మారారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తే పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా రైతుకు లాభదాయకంగా కూడా మారుతుందని నిరూపిస్తున్నారు.


శ్రీనివాసరెడ్డి అరటి తోటను పరిశీలిస్తున్న కేరళ వ్యవసాయ అధికారుల బృందం

శ్రీశైలంలో కల్యాణ మండపం నిర్మాణం

● ప్రారంభించిన జస్టిస్ లావు నాగేశ్వరరావు


కల్యాణ మండపం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు

చిలకలూరిపేట ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త దండా బ్రహ్మానందం శ్రీశైలం కాకతీయ కమ్మసత్రం ఆవరణలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు సంపాదించడం ముఖ్యం కాదని, సమాజ హితం కోసం, తోటి వారికి సాయం చేసేందుకు డబ్బు ఖర్చు చేసే గుణం అలవర్చుకోవాలని సూచించారు. దండా బ్రహ్మానందం ఆ కోవలోకి వస్తారని చెప్పారు. కులమేదైనా పేదలు, మధ్యతరగతి కుటుంబాల వారు తక్కువ ఖర్చుతో వివాహాలు చేసుకోడానికి కల్యాణ మండపంలో అవకాశం కల్పించ పూనుకోవడం అభినందనీయమన్నారు. కుల భేదం లేకుండా వేలాదిమంది భక్తులకు శ్రీశైలంలో నిత్యం భోజన సౌకర్యం కల్పిస్తున్న సత్రం కమిటీని ఆయన అభినందించారు. దండా బ్రహ్మానందం, లక్ష్మీరాజ్యం దంపతులను లావు నాగేశ్వర రావు ఘనంగా సత్కరించారు. అతిథులుగా విజయవాడ సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరా వు, హైదరాబాదు కాకతీయ విద్యా ట్రస్టు అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు(చిలకలూరిపేట) అధ్యక్షత వహించగా, కార్యదర్శి తుమ్మల రమేష్ చంద్రబోస్ (హైదరాబాదు), కోశాధికారి ముత్తినేని వెంకటేశ్వ ర్లు(వినుకొండ) పాల్గొన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైళ్ల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం

● అన్ని రంగాల్లో డివిజన్‌ని అగ్రపథాన నిలబెట్టేందుకు కృషి ● మీడియా సమావేశంలో నూతన డీఆర్ఎం సుధేష్ణ సేన్


రైల్‌వికాస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైళ్ల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ చెప్పారు. భద్రతకు సంబంధించి ప్రతీ చిన్న విషయాన్ని లోతుగా పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పారు. గత సోమవారం గుంటూరు నూతన డీఆర్ఎంగా బాధ్యతలు స్వీకరించిన సుధేష్ణ సేన్ శనివారం సాయంత్రం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ భద్రతతో పాటు రైళ్లు, గూడ్స్‌ల సమయపాలన, అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైళ్ల సమయపాలనలో గుంటూరు డివిజన్ ముందువరసలో ఉందన్నారు. గత ఏడాది దేశంలోనే 10వ స్థానంలో, జోన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. రైల్వేలో కొత్త విధానపరమైన నిర్ణయాలు అమలులోకి వచ్చాయని, వాటన్నింటిపై ఎప్పటికప్పుడు అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి అప్‌డేట్ చేస్తామన్నారు.

గుంటూరు డివిజన్‌లో డీఆర్ఎంగా విధులు నిర్వహించడం ఎన్నో సవాళ్లతో కూడుకున్న బాధ్యత అని, కచ్చితంగా వాటిని అధిగమించేందుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. సరుకు రవాణ, ప్యాసింజర్ టిక్కెట్ల ఆదాయంలో ఎంతో పురోగతి సాధించిందని, గత ఏడాది రూ. 431 కోట్లు వసూలు చేసి డివిజన్ చరిత్రలో రికార్డు నెలకొల్పిందన్నారు. ఈ ఏడాది మరిన్ని మార్గాలను అన్వేషించి రైల్వేకు ఆదాయం పెంచుతామని చెప్పారు. డివిజన్‌లో ఇంజనీరింగ్ వర్కులు బాగా జరుగుతున్నాయని, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్, నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం వంటి పనులు పూర్తి అయితే డివిజన్ మరింత పురోగతి సాధిస్తుందన్నారు. ఇంకా డివిజన్‌కు శాంక్షన్ అయి ఉన్న ఇంజనీరింగ్ వర్కులు, రైలుమార్గాలను ఇన్‌స్పెక్షన్ చేసి సమీక్షలు నిర్వహించి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటామన్నారు. రైల్వే సిబ్బంది సౌకర్యార్థం అనేక ఆస్పత్రులు నిర్మించడం జరిగిందని, అవి పూర్తిగా ఉపయోగపడేలా చూస్తామన్నారు. ఇక్కడ డీఆర్ఎంగా నియామకం పొందడం సంతోషంగా ఉందని, మూడు నెలల్లో తెలుగు భాష నేర్చుకుని స్థానిక భాషలోనే మాట్లాడేందుకు ప్రయత్నిస్తానన్నారు. అలానే ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్ పాల్గొన్నారు.



గుంటూరులో సంయుక్త మీనన్ సందడి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డెవిల్, సార్, విరూపాక్ష చిత్రాల హీరోయిన్ సంయుక్త మీనన్ శనివారం గుంటూరులో సందడి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన సంయుక్త మీనన్‌ను చూసేందుకు ప్రేక్షకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆమెతో సెల్ఫీ తీసుకునేందుకు అభిమానులు ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ మాట్లాడుతూ గుంటూరుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం హీరో బాలకృష్ణ నటిస్తున్న అఖండ-2లో కీలక పాత్ర పోషిస్తున్నానన్నారు.

గుంటూరు మీదగా విశాఖపట్టణం, కర్నూలు సిటీ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా విశాఖపట్టణం, కర్నూలు సిటీలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 08545 విశాఖపట్టణం - కర్నూలు సిటీ ప్రత్యేక రైలు ఈ నెల 15వ తేదీ నుంచి మే 27వ తేదీ వరకు ప్రతీ మంగళవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.35కి గుంటూరు, 2.28కి నరసరావుపేట, 2.58కి వినుకొండ, బుధవారం ఉదయం 9.35కి కర్నూలు సిటీ చేరుకొంటుంది. నంబరు. 08546 కర్నూలు సిటీ - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 16 నుంచి మే 28 వరకు ప్రతీ బుధవారం సాయంత్రం 4.10కి బయలుదేరి రాత్రి 9.58కి వినుకొండ, 10.33కి నరసరావుపేట, 11.25కి గుంటూరు, గురువారం ఉదయం 8 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుందన్నారు.

కుక్కలపై 'అవిశ్వాస తీర్మానం'

● బయటకు తరలించాలని స్వచ్ఛంధ సంస్థలకు పిలుపు
● బహిరంగ ప్రకటన జారీ చేసిన సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కుక్కలను పరిసర ప్రాంతాల నుంచి బయటకు తోలడం చిన్న విషయమే. కాని ఇది గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో పెద్ద వివాదంగా మారింది. జీజీహెచ్‌లో రాత్రింబవళ్లు వందలాది కుక్కలు తచ్చాడుతున్నాయి. వీటిని బయటకు తరలించడం అధికారులకు తలకు మించిన భారంగా పరిణమిస్తోంది. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కొద్ది రోజులుగా భారీ సంఖ్యలో శునకాలు తిష్టవేశాయి. ప్రతినిత్యం సుమారు 200 కుక్కలు ఆవరణలో తచ్చాడుతుంటాయి. రోగులు, వారి సహాయకులు వేసే ఆహార పదార్థాలు తినేందుకు ఇవి నిత్యం ఆసుపత్రిలో తిరుగుతున్నాయి. మధురాన్నం భోజనశాల, శాంతి మైదానం, తల్లీబిడ్డ గార్డెన్స్ వంటి ప్రాంతాలతో పాటు వివిధ వార్డుల



సమీపంలో తిరుగుతూ అక్కడ పడవేసే పదార్థాల కోసం ఎగబడుతుంటాయి. క్యాజువాల్టీ సమీపంలోని పోలీస్ ఔట్ పోస్ట్ సిబ్బంది సైతం వీధి కుక్కలకు ఆహారం వేస్తూ పెంచిపోషించడం విశేషం. ఇవి రోగులపై, వారి సహాయకులపై ఎగబడి కరిచేందుకు ప్రయత్నించడం అధికారులకు తల నొప్పిగా మారింది.

స్వచ్ఛంధ సంస్థల సాయం కోసం వేడుకోలు...

నగర పాలక సంస్థ సహకారంతో వీటిని పట్టుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి బయట విడిచిపెట్టినా మరలా అవి ఆసుపత్రిని వెతుక్కుంటూ వస్తున్నాయి. ఇటీవల ఆసుపత్రిలో 50 కుక్కలను పట్టుకొని కు.ని. సర్జరీలు చేసి వదిలిపెట్టారు. మరో పక్క ఇలా కుక్కలను బలవంతంగా బయటకు తరలించడం చట్టరీత్యా నేరమని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామంటూ జంతు ప్రేమికుల సంఘం ప్రతినిధులు ప్రతిఘటిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో తిరుగుతున్న కుక్కలను బయటకు పట్టుకెళ్లి ఆసుపత్రిలో సమస్యలు తగ్గించేందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి బహిరంగ ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆసుపత్రిలో కుక్కల సంతతి తగ్గించి వాటి ద్వారా వచ్చే సమస్యలను నియంత్రించడానికి స్వచ్ఛంధ సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న స్వచ్ఛంధ సంస్థలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని శనివారం ప్రకటన జారీ చేశారు.


ప్రార్థన చేస్తున్న బ్రదర్ మాథ్యూస్, సభలకు హాజరైన విశ్వాసులు

ఏసుక్రీస్తు... ఆదరణకర్త

● కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ మాథ్యూస్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు ఎదుట కృపా మినిస్ట్రీస్ 19వ అంతర్జాతీయ కృపా మహాసభలు మూడో రోజుకు చేరుకున్నాయి. కృపా మినిస్ట్రీస్ దైవజనులు నూతన గీతాలను ఆలపించి దేవుని మహిమ పరిచారు. లోకంలో ప్రజలందరూ ఆశీర్వాదకరంగా బతకాలని దేవుడు మనలను అందుకొరకే పిలిచాడని ప్రజలందరూ ఐక్యత సమాధానం కలిగి బతకాలని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బ్రదర్ మాథ్యూస్ సందేశమిచ్చారు. మనుషులు ఉప్పు వలే సారం కలిగి బతకాలని ఎదుటివారికి మేలుకరంగా, ఉండాలని పాస్టర్ భోగి శాంతారావు సందేశమిచ్చారు. ప్రభువు రాకడ సమీపముగా ఉందని ప్రజలందరూ ఆయన రాకడ కొరకు సిద్ధపడి ఉండాలని పాస్టర్ వినయ్ మాథ్యూస్ సందేశమిచ్చారు. ఆదివారంతో 19 మహా సభలు ముగుస్తాయని ఆయన తెలిపారు. ప్రార్థనల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని ఆశీర్వచనాలు పొందారు.

కళల పూర్వవైభవానికి సీఎం శ్రీకారం

◆ తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ◆ ప్రారంభమైన కొండవీటి కళాపరిషత్ నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్రంలో కళలకు, కళారంగానికి పూర్వవైభవం ప్రారంభమైందని, కళలపై ఆయన చూపిస్తున్న నిబద్ధత, ప్రభుత్వ స్థాయిలో తీసుకుంటున్న చర్యలు ఈ రంగానికి కొత్త శ్వాసను అందిస్తున్నదని తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గోపాలకృష్ణ జ్యోతి వెలిగించగా మరో అతిథి పీపుల్స్ ట్రామా, పుడమి మైన్స్‌ల డైరెక్టర్ ముత్తవరపు అరుణకుమారిలు నటరాజ పూజచేసి తొలిరోజు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముఖ్యమంత్రిని కళాకారులు దీనాతిదీనంగా వేడుకున్నా కళల ప్రోత్సాహకానికి, కళాకారుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా విదిల్చలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే 80మంది కళాకారులకు కళారత్న అవార్డులు అందజేయడం గొప్ప ఘట్టమని అంతేగాకుండా ఉగాది పురస్కారాలు అందజేశారని, అలాగే ఈ నెల 16న కందుకూరి పురస్కారాలను కూడా అత్యంత ఘనంగా అందించేందుకు ప్రభుత్వం సిద్దమవుతోందన్నారు. జిల్లా స్థాయిలో 130మందికి రూ.లక్ష


నాటిక పోటీలను ప్రారంభిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ, అరుణకుమారి

బహుమతితో అవార్డులు అందించనుండడం ఒక చారిత్రక ఘట్టం కానుందన్నారు. ఖర్చులు భరిస్తూ నాటిక పోటీలు నిర్వహిస్తున్న కళా పరిషత్‌లకు, సమాజాలకు అవసమైన మౌళిక సదుపాయాలు, ప్రభుత్వ మద్దతు లభించేలా ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించి తెలుగు నాటక అకాడమీ ద్వారా సాంస్కృతిక శాఖామంత్రి దృష్టికి తీసుకెళతామని. త్వరలోనే నాటక సమాజాల వారితో సమావేశం నిర్వహించి వారి సూచనలు, సలహాలతో ముందుకు వెళతామన్నారు. పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా పఠాన్ సుభాని, జక్కుల సుధాకర్, దండా వీరాంజనేయులు, బుద్దాల వెంకటరామారావు, జవ్వాది దాసరధి శ్రీనివాస్, ఆలోకం అమరలింగస్వామి, పరిషత్ ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మహాకవి కాళిదాసు కళాప్రాంగణంలో మూడు నాటికలను ప్రదర్శితం అయ్యాయి.

బంధం బలపడితే ఏర్పడేదే 'దేవరాగం'

బంధం మనిషి నుంచి మరో మనిషికి జన్మనిచ్చిన కణబంధం. ఇది తల్లిదండ్రులకు, సంతానానికి పరిమితం. ఆ బంధం విచ్ఛిన్నమైతే తల్లిదండ్రులకు శాపం అవుతుందని, విడవకుండా కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉంటే ఆ వృద్ధాప్యమే ఆ తల్లిదండ్రులకి మధురమైన మలిదశలోని బాల్యం అవుతుందని తెలిపేదే 'దేవరాగం' నాటిక రక్తసంబంధాలు, పేగుబంధాలు, అనుబంధాలు గురించి ఎంతో అద్భుతంగా వివరించిన ఈ నాటికను సౌజన్య కళాస్రవంతి, ఉత్తరాంధ్ర వారు ప్రదర్శించిన ఈ నాటికను సలీం రచించగా కేకేఎల్ స్వామి దర్శకత్వం వహించారు.

రెండవ ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి 'కిడ్నాప్', తృతీయ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్, గుంటూరువారి 'చిగురుమేఘం' నాటికలు ప్రదర్శితమయ్యాయి.

నేడు హోమియోపతి వైద్యుల రాష్ట్ర సదస్సు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంగమేశ్వరరావు, రమణరావు తదితరులు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) రాష్ట్ర శాఖ 28వ వార్షిక సదస్సు ఆదివారం గుంటూరులో జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పంచుమర్తి సంగమేశ్వరరావు తెలిపారు. శనివారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి రోడ్‌లోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి ప్రారంభిస్తారని సంగమేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది హోమియోపతి వైద్యులు ఈ సదస్సులో పాల్గొంటారని ఆయన వివరించారు. సైంటిఫిక్ సెషన్‌లో చిన్నపిల్లల్లో ఆటిజం వ్యాధి చికిత్సల్లో హోమియోపతి వైద్యం పాత్ర అనే అంశంపై ముంబయ్‌కి చెందిన డాక్టర్ సమీర్ చౌకర్ ప్రసంగిస్తారన్నారు. సదస్సులో భాగంగా హోమియో వైద్యశాస్త్ర పితామహుడు డాక్టర్ హానిమన్ 270వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామని డాక్టర్ సంగమేశ్వరరావు తెలిపారు. సదస్సు ముగింపు సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ రాష్ట్ర, జిల్లా శాఖలకు నూతన కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. సమావేశంలో వార్షిక సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎండీవీ రమణరావు, సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ కోదండరామిరెడ్డి, కోశాధికారి డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ పంచుమర్తి కల్పన తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

గో మరణాలపై భూమన అసత్య ప్రచారం

● ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ అబద్ధయ్య

మంగళగిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా టీటీడీపై భూమన కరుణాకర్‌రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారం మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. టీటీడీ గో మరణాలపై భూమన చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా తప్పుడు ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గోశాలలో వంద ఆవులు మృతిచెందాయంటూ భూమన చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయంలో నెలకు సగటున పది ఆవుల వరకు మృత్యువాత పడుతుంటాయని తెలిపారు. గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై టీటీడీ క్రమం తప్పకుండా సమీక్షిస్తుందని, టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తూ గోవుల సంరక్షణను సక్రమంగా చూసుకుంటున్నారని ఆయన చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు జమ

● ప్రతిసారి రోడ్డెక్కే పరిస్థితి తేవద్దు : సంఘం నేతలు

తుళ్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల రెండు నెలల పెండింగ్ జీతాలను సీఆర్డీఏ వారి ఖాతాల్లోకి శుక్రవారం సాయంత్రం జమ చేసింది. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించి, ప్రజలకు అనా రోగ్య సమస్యలు రాకుండా పని చేసే కార్మికులకు జీతాలు రాలేదని రోడ్డెక్కే పరిస్థితిని ఇక ముందు రాకుండా చూడాలని పారిశుధ్య కార్మికుల గౌరవ సంఘం అధ్యక్షుడు ఎం రవి సీఆర్డీఏ అధికారులను శనివారం ఒక ప్రకటనలో కోరారు. వారికి పని భద్రత కల్పించి, నెలకు రూ.21 వేలు జీతం చెల్లించే విధంగా చేయాలని కోరారు.

ఆరో రోజుకు చేరిన క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో పని చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు చేస్తున్న సమ్మె శనివారంతో ఆరో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సీఐటీయూ నేతలు చెంగయ్య, ఎం.బాలాజీ, ఎయిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేత బుజ్జిబాబు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతితక్కువ వేతనంతో పని చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు డి.శివ, కార్య దర్శి ఎం.రవి, యూనియన్ నేతలు ఎం యోహాన్, జే శ్రీకాంత్, ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జన సేవాదళ్ శిక్షణ

● నేడు సీపీఐ నారాయణ రాక

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చిన కాకాని గ్రామంలో జన సేవాదళ్ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. శిక్షకులు నార్ల వెంకటేశ్వరరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పీఎల్ వెంకటేశ్వరరావు, హేమశంకర్, మురళీ యువతకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ శిబిరాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, తదితరులు సందర్శించారు. శిక్షణా తరగతుల్లో నాలుగో రోజైన ఆదివారం ఉదయం సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ హాజరవుతున్నట్టు నేతలు తెలిపారు.

భోగి కోటేశ్వరరావుకు దానబోయిన సత్కారం

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆదేశాల తో మంగళగిరి శివాలయం ఆలయ కమిటీ చైర్మన్‌గా రెండో సారి ఎన్నికైన భోగి కోటేశ్వరరావును టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్, శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు రాష్ట్రం లో బీసీలకు పెద్దపీట వేశారని బీసీలకు అండగా టీడీపీ ఉంటుందని చెప్పారు.

కేఎల్‌యూలో ఏఐ ఎమర్జింగ్ టెక్నాలజీపై జాతీయ సదస్సు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కృత్రిమ మేధస్సు ఎమర్జింగ్ టెక్నాలజీల యుగంలో స్థిరమైన నిర్వహణ, అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సును శనివారం ఘనంగా నిర్వహించారు. సమావేశ లక్ష్యాలను సదస్సు కన్వీనర్ డాక్టర్ కేఎస్ వెంకటేశ్వరకుమార్ వివరించారు. ఎంబీఏ విభాగాధిపతి ఎస్ రమేష్ బాబు అతిథులకు స్వాగతం పలికి అధ్యక్షత వహించారు.

సైబర్ భద్రత ఇకపై ప్రత్యేక అంశం కాదు

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

● వీఐటీలో ముగిసిన హ్యాకథాన్ ఎక్స్ సెమీ ఫైనల్



వీఐటీలో హ్యాకథాన్ ఎక్స్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తుళ్లూరు(ఐనవోలు), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ భద్రత ఇకపై ప్రత్యేక అంశం కాదని ఇది జాతీయ ప్రాధాన్యం కలిగినటువంటిదని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. రాజధాని అమరావతి వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయంలో నేషనల్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ కౌన్సిల్(ఎన్‌సీఎస్ఆర్‌సీ) ఆధ్వర్యంలో శనివారం జాతీయ స్థాయి హ్యాకథాన్ ఎక్స్ సెమీ ఫైనల్ కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలనుంచి పాల్గొన్న జట్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. ఇందులో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లను నగదు బహుమతితో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచిని ప్రశంసించారు. భారత సాంకేతిక పురోగతికి తోడ్పడటం కొనసాగించాలని కోరారు. గౌరవ అతిథి ఖీలీ రాజ్ నాయుడు (డైరెక్టర్ ఎన్‌సీఎస్ఆర్‌సీ)మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యం కలిగిన సైబర్ భద్రతా నిపుణుల అవసరం పెరుగుతోందని, హ్యాకథాన్ ఎక్స్ వంటి అనుభవపూర్వక అభ్యాస వేదికల ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. వైస్ ఛాన్సలర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ హ్యాకథాన్ ఎక్స్ వంటి కార్యక్రమాలు భారతదేశానికి సురక్షితమైన డిజిటల్ భవిష్యత్తును నిర్మించడంలో సహాయపడతాయని తెలియజేశారు. మొదటి స్థానం పహాడి పేలోడ్స్ రెండో స్థానం సైకోడ్‌లో వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం. మూడో స్థానంలో హెచ్4 కేసీ-077లో ఆర్ఎంకే ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల ఉంది. కార్యక్రమంలో సుధాకర్ ఎలాంగో(డీన్, స్కోప్), సయ్యద్ ముస్సేన్ (ఈవెంట్ కోఆర్డినేటర్), సరోజ్ ఉమార్ పాణిగ్రాహి (అసోసియేట్ డీన్, స్కోప్), విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాసాల కూల్చివేత బాధాకరం : ఎమ్మెల్యే బూర్ల


ఎమ్మెల్యే రామాంజనేయులుకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ముందస్తు సమాచారం లేకుండానే నగరపాలక సంస్థ అధికారులు రూరల్ మండలం, వెంగళాయపాలెంలో పేదల నివాసాల కూల్చివేత ఘటన బాధాకరమని ప్రత్తిపాడు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక విద్యానగర్, క్యాంపు కార్యాలయంలో బాధితులు ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూల్చివేత ఘటనపై పూర్తి వివరాలను తెప్పించుకుని బాధితులకు న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మున్సిపల్ అధికారులు ఎటువంటి నోటీసులు సమాచారం లేకుండానే బుల్డోజర్ల సాయంతో కూల్చివేశారని బాధితులు వాపోయారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగర పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేస్ 3 పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇళ్లు కోల్పోయే స్థానికులకు అందజేసే నష్ట పరిహార అంచనా కార్యక్రమాన్ని శనివారం అధికారులు చేపట్టారు. స్థానికుల నుంచి వివరాలను సేకరించారు. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులను మొదలు పెడతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో 41 డివిజన్ కార్పొరేటర్ స్మిత పద్మజ, టీడీపీ నాయకులు బుర్రి సురేష్, పంచుమర్తి శేషు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుల జాతి గుండెచప్పుడు ఏకలవ్యుడు

● ఘనంగా ఏకలవ్య విగ్రహావిష్కరణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఏకలవ్యుడు ఎరుకల సామాజికవర్గంలో జన్మించడం ఆ సమాజానికి వర్తమాన భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక అమరావతి రోడ్డులో ఏకలవ్యుని విగ్రహావిష్కరణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గుంటూరు నగర ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎరుకల సమాజ సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ గిరిజనుల రిజర్వేషన్లు ఆరు శాతం రాష్ట్రవ్యాప్తంగా కచ్చితంగా అన్ని స్థాయిలలో అమలు చేసేలా కృషి జరగాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన అభివృద్ధి సంఘం అధ్యక్షుడు మేడా లక్ష్మయ్య వహించారు. కార్యక్రమంలో విజయవాడ ఏఎస్పీ కుంభ కోటేశ్వరరావు, సంఘ సభ్యులు ఉయ్యాల వెంకటేశ్వర్లు, తోకల పాపారావు, మేడ బ్రహ్మయ్య, తోకల రామకృష్ణ, కుంభ ఏడుకొండలు, మేడా హనుమంతురావు, కార్పొరేటర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానంలో వైభవంగా శ్రీచండీహోమం

దుగ్గిరాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానంలో చైత్రమాసం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీచండీహోమం శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు తారక్‌నాథ్‌శర్మ, సుబ్రహ్మణ్యశర్మలు శాస్త్రోక్తతంగా నిర్వహించిన చండీహోమం ఆర్‌వీఎస్ సత్యనారాయణ, హేమలత దంపతులచే జరిపించారు. ఆలయకార్యనిర్వాహక కార్యదర్శి కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు చండీహోమంలో పాల్గొన్న భక్తులకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పూర్ణాహుతి కార్యక్రమానంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులందరికీ తీర్థప్రసాదాలను అందించారు.

సంపద సృష్టించి పంచాలన్నదే లక్ష్యం

● ఎమ్మెల్సీ ఆలపాటి


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

పెదనందిపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించి పది మందికి పంచాలన్నదే కూటమి లక్ష్యం అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక అనంతరం తొలిసారిగా పెదనందిపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు శివరామకృష్ణయ్య నివాసం వద్ద టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం కొనసాగాలన్నా, అభివృద్ధి చేయాలన్నా వనరులు అవసరం అని, వీటి కోసం చంద్రబాబు నాయుడు ఆహార్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హనుమంతురావు, రాంబాబు, శ్రీనివాసరావు, పినాకిపాణి, రామచంద్రరావు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలతో కూడిన బోధన అభినందనీయం

విద్యార్థులకు మానవతా విలువలతో కూడిన విద్యను బోధించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి అన్నారు. స్థానిక అశోక పాఠశాల 34వ వార్షికోత్సవం శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు మంత్రి లోకేశ్ చేయూత

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు చిరువ్యాపారులకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చేయూతనందించారు. నవులూరు గ్రామానికి చెందిన అబ్దుల్ జానీ, నల్లమోతుల మాధవి, మంగళగిరి పట్టణానికి చెందిన చింతలపూడి దుర్గ, తాడేపల్లి పట్టణానికి చెందిన షేక్ సాహిల్‌కు స్థానిక టీడీపీ నేతల ద్వారా శనివారం టిఫిన్ బండ్లు అందజేయించారు. మంత్రి లోకేశ్ ఆర్థిక సహకారంతో టిఫిన్ బండ్లు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమాల్లో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ పంపిన పెండ్లికానుక అందజేత

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని రాధారంగానగర్‌లో పీ రామాంజనేయులు, అంజలి కుమార్తె శివకుమారి, తలారి రామకృష్ణ, వెంకటలక్ష్మిల కుమారుడు సునీల్‌కుమార్ వివాహ మహోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ పంపిన పెండ్లికానుకను గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో శనివారం నేతలు అందజేశారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, యర్రంశెట్టి గణేష్, కామినేని సాంబశివరావు, షేక్ ఇమాంసా తదితరులు వధూవరులకు ఆశీస్సులు అందజేశారు.

వడ్డేశ్వరంలో సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యశాలలో వైద్యం చేయించుకుని పలువురు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి అర్జీ పెట్టగా మంత్రి లోకేశ్ వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నేతలు లబ్ధిదారులకు శనివారం అందజేశారు. వడ్డేశ్వరం మరియమ్మకు రూ.25541లు, షేక్ మహమ్మద్‌కు రూ.20000లు, పఠాన్ గుల్జార్‌కు రూ.30వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయగా లోకేశ్ పంపిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను టీడీపీ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వడ్డేశ్వరం రాజారావు, షేక్ ఇమాంసా, భీముడు, జానీ, జాకీర్, చిలకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

కాటూరి ఆర్ట్ గ్యాలరీలో గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్


శిల్పాలను పరిశీలిస్తున్న గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్ రాజశేఖరన్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీని గిన్నిస్ రికార్డు సాధించిన రాజశేఖరన్ పరమేశ్వరన్ సందర్శించారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఆయన అంతర్జాతీయ చిత్రకారునిగా రెండు మార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. గ్యాలరీలో ఏర్పాటు చేసిన పలు రకాల శిల్పాలను పరిశీలించారు. చిన్న పట్టణంలో ఇంత విశిష్టత ఉన్న విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విజయవాడ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఇన్ని విగ్రహాలను పలు రకాల ముడి పదార్థాలతో తయారు చేయడం అరుదైన విషయమన్నారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. వజ్రాల రామలింగాచారి, పార్వతి, ఉదయ శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

ఒకేషనల్ పరీక్షల ఫలితాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఒకేషనల్ పరీక్ష ఫలితాల్లో సెయింట్ పాల్స్ ఒకేషనల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. సీనియర్ వెటర్నరీ డైరీయింగ్ కోర్సులో వెయ్యి మార్కులకు గాను హేమిమాకు 923, నర్సింగ్‌లో గుణప్రియ 868, ఎంఎల్‌టీలో ప్రగతి 834, హరికృష్ణ 800 మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ లింకన్‌బాబు, అధ్యాపకులు కీర్తి, స్వేచ్ఛ, కరస్పాండెంట్ షీలాసృజని అభినందించారు.


చిన్నారులకు పండ్లను పంపిణీ చేస్తున్న. శ్యామ్ అండ్ జీన్ పౌండేషన్ సభ్యులు

చిన్నారులకు రొట్టెలు పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక యడ్ల లింగయ్య కాలనీలో శనివారం శ్యామ్ అండ్ జీన్ ఫౌండేషన్ సభ్యులు పేద చిన్నారులకు పండ్లను, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ అండ్ జే ఫౌండేషన్ అధ్యక్షుడు అలెగ్జాండర్ మాణిక్యం పాల్గొని 150 మంది చిన్నారులకు రొట్టెలు, మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం కాలేజీ విద్యార్థులు తన్మయి, రాధ, తేజస్విని, సృజనారెడ్డి, అభిలాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్క మృతిపై చెల్లి ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అక్క మృతిపై చెల్లెలు ఫిర్యాదు చేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. శనివారం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఐతానగర్ లంకదిబ్బకు చెందిన కావూరు సత్యవతి తన కుమారుడు శివప్రసాద్‌తో కలసి జీవిస్తోంది. నాలుగేళ్ల క్రితం ఆమె పక్షవాతానికి గురైంది. ఆమె తన పనులు తాను చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీన సత్యవతి కుమారుడు శివప్రసాద్ తన పిన్ని అయిన బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన అచ్చి పద్మావతికి ఫోన్ చేసి తన తల్లి గడ్డిమందు తాగిందని, జిల్లా వైద్యశాలలో వైద్యం కోసం చేర్పించానని తెలిపాడు. శనివారం తన అక్కను చూడడానికి వచ్చిన పద్మావతికి వైద్యులు సత్యవతి మృతి చెందిందని తెలిపారు. దీనితో తన అక్క మృతిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా శ్రీపేరంటాళ్లమ్మ కల్యాణ మహోత్సవం

కొల్లిపర, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లభాపురంలో గాదె సర్విరెడ్డి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం సర్విరెడ్డి పేరంటాళ్లమ్మ దంపతులకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ రవీంద్రరెడ్డి బందోబస్తును ఏర్పాటు చేశారు.

అంగరంగ వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం


కల్యాణ పూజలు అందుకున్న శ్రీ చెన్నకేశవ స్వామి

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో వేంచేసియున్న శ్రీభూలీలా సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి కల్యాణ క్రతువులను వేద పండితులు నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. శనివారం ఉదయం గరుడోత్సవం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామి వారి ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

రహదారుల అనుసంధానంపై దృష్టి సారించాలి


విలేకర్లతో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు రహదారుల అనుసంధానంపై దృష్టి సారించాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం అధ్యక్షుడు దర్శి శివకోటేశ్వరరావు కోరారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, ట్రాక్టర్లు, లారీలు వంటి పెద్ద వాహనాలు పట్టణంలోకి రావడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇందుకోసం కొత్తపాలెం, డొంక, గోలిడొంకను అభివృద్ధి చేయాలన్నారు. బుర్రిపాలెం రోడ్డు పరిశ్రమలతో ఉన్నందున గాంధీచౌక్ మీదుగా భారీ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులు సేకరించి పీఎంజీఎస్‌వై పథకం కింద రహదారులు నిర్మించాలని మంత్రి మనోహర్, కేంద్రమంత్రి పెమ్మసానిలను కోరారు. సభ్యులు శివశంకరరావు, ఆరీఫ్, కమల్, అబ్రహాంలింకన్, రామకృష్ణమూర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు


ఏఆర్ఆర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న కమిటీ సభ్యులు

కొల్లిపర, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కొల్లిపర శ్రీ అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థిని అవుతు రత్నకుమారి మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 460/470మార్కులు, బైపీసీలో గుదిబండి బసవసింధు 420/440 మార్కులు, సెకండియర్‌లో కొల్లి దీపిక ఎంపీసీలో 933/1000 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమస్థానంలో నిలిచినందుకు కళాశాల కమిటీ సభ్యులు వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అవుతు కృష్ణారెడ్డి, కోశాధికారి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వింతా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న శివసాంబిరెడ్డి

తగ్గిన నిమ్మ దిగుబడి

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

తెనాలిరూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహకరించకపోవడంతో నిమ్మకాయలకు డిమాండ్ ఉండే సీజన్లలో పూత, పిందె రాలి పోయి కాపులేక రైతులకు దిగుబడి తగ్గి ఆందోళన చెందే పరిస్థితి నెలకొందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిమ్మరైతులను శివసాంబిరెడ్డి కలిసి వారి కష్టసుఖాలను విచారించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ నవంబరు నుండి ఫిబ్రవరి వరకూ నిమ్మకాయలకు మంచి సీజన్‌గా ఉంటుందన్నారు. గత ఏడాది ప్రకృతి సహకరించకపోవడంతో పూతరాలి పోయి ఆశించినంత దిగుబడి నిమ్మరైతులకు రాలేదని ఆరోపించారు. ఎకరం నిమ్మతోట కౌలుకు రూ.లక్ష నుండి రూ.లక్షన్నర వరకూ ఉందని దిగుబడి తగ్గడంతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు తెలిపారన్నారు. మార్కెట్లో నిమ్మకాయలు విక్రయాలకు వచ్చే రైతుల నుండి 10శాతం కమిషన్, ధర్మం వగైరాలను అరికడితే రైతాంగానికి అదనపు భారం తగ్గించి ఊరట లభించే అవకాశం ఉందన్నారు. నిమ్మరైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. రైతులు కంచి కృష్ణ, ఉండవల్లి శేషగిరావు, గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షేక్ హమ్మద్, రవీంద్రబాబు, వెలగా ఆదినారాయణ, అడపా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


108 అమ్మవారి కలశాలతో నగరోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

జ్ఞాన గాయత్రి కలశాలతో నగరోత్సవం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహాగాయత్రి అమ్మవారి యజ్ఞపూజల్లో భాగంగా శనివారం 108 కలశాలతో నగరోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్ ఆవరణలో శనివారం గాయత్రీ త్రిశక్తి పీఠం చెంచుపేట ఆధ్వర్యంలో 108 కుండముల జ్ఞాన గాయత్రీ మహా యజ్ఞం పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలకరించిన వాహనంపై గాయత్రీ అమ్మవారి ప్రత్యేక కలశాన్ని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం 108 కుండముల జ్ఞాన గాయత్రీ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గాయత్రీ త్రిశక్తి పీఠం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నారై కళాశాల విద్యార్థికి 988 మార్కులు


విద్యార్థులను అభినందిస్తున్న డీన్ ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో సీనియర్ ఎంపీసీలో ఎన్నారై కళాశాల విద్యార్థి సోహిత్‌కు మార్‌కు 988 మార్కులు లభించాయి. పట్టణంలోని కళాశాలలో డీన్ ఉమామహేశ్వరరావు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎం.పూజిత 987, సీనియర్ బైపీసీలో మౌనిక 986, రిస్సా 984, సీనియర్ ఎంఈసీలో లక్ష్మీదుర్గావైష్ణవి 928, సీనియర్ సీఈసీలో మేఘన 903 మార్కులు పొందారు. జూనియర్ ఎంపీసీలో మనస్విని, మధువర్షిణి, నందిత సరోజ, సౌమ్యశ్రీ, ప్రసన్నకుమార్‌లకు 466 మార్కులు లభించాయి. బైపీసీలో మనీషా 436, ఐశ్వర్య, హర్షవర్ధన్, రేష్మ 432, ఇందుసాయి, వెంకటకావ్య 431 మార్కులు సాధించారు. జూనియర్ ఎంఈసీలో ఎం.హరిక 480, సీఈసీలో మణిమేఘన 485 మార్కులు సాధించినట్లు డీన్ తెలిపారు. ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, శివన్నారాయణ, కిషోర్, సురేష్, లాజర్ పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్‌లో వివేకా విద్యార్థికి 989 మార్కులు


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వీరనారాయణ, అధ్యాపకులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాలలో వివేకా విద్యార్థికి వెయ్యి మార్కులకు గాను ఎంపీసీలో ఫరీదా 989 మార్కులు సాధించింది. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం నాజరుపేట కళాశాలలో డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, అధ్యాపక బృందం అభినందించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470కి గాను కె.కృష్ణప్రియ 467 మార్కులు సాధించింది. సీనియర్ ఎంఈసీలో గురులావణ్య 978, బైపీసీలో కబీర్‌ఖాన్, దుర్గాప్రసాద్‌లకు 988 మార్కులు, చైతన్యకు 987, తనూజ, రంగ 986 మార్కులు, జ్ఞానకార్తీక్, భవన, వర్షిణీలకు 985 మార్కులు, జశ్వంత్ 984 మార్కులు సాధించినట్లు డైరెక్టర్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 25 మంది విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించారు. సీఈవో ఉదయ్‌కిరణ్, ప్రిన్సిపల్ జ్యోతి, సునీల్, శ్రీనివాస్, ప్రభాకరరెడ్డి, మురళీ, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ యువతికి పెళ్లి చేయడం ఆనందంగా ఉంది

● గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత మురళి


వధువుకు పెళ్లికానుకలను అందిస్తున్న గణేష్ యూత్ కన్వీనర్ మురళి, ఉపసర్పంచ్ నాగభూషణం తదితరులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నా అనేవారు లేని జీవితం ఎంతో నిరాశకు గురిచేస్తుందని అటువంటి బాధ అనాథలకు రాకూడదన్న ఉద్దేశంతో తానే పెళ్లి పెద్దగా ఉండి నిశ్చితార్థ కార్యక్రమాన్ని చేపట్టినట్టు గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్‌నేత వీరవల్లి మురళి అన్నారు. శనివారం స్థానిక జేఎంజే స్వధార్ హోంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయురాలు మండలి శుభ్రిని నరసరావుపేట పాలపాడు గ్రామానికి చెందిన కొలిశెట్టి తేజసాయిల వివాహనిశ్చితార్థ కార్యక్రమాన్ని వీరవల్లి మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వధువుకు పెద్దగా బంగారు మంగళసూత్రం, పట్టుచీరలు ఇతర వివాహ సామాగ్రిని శాస్త్రయుక్తంగా అందించి కాబోయే దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ స్వధార్ హోంలో నా అనేవారు లేక ఆశ్రయం పొందుతున్న యువతులకు తానే ఇంటిపెద్దగా నిలబడి సాంప్రదాయ బద్ధంగా వివాహ కార్యక్రమాన్ని జరపడం సంతోషంగా ఉందన్నారు. పెళ్లి పెద్దగా వివాహాలను జరుపుతున్న మురళిని ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, ముప్పవరపు సాంబశివరావు, నయిం కలాం ఎల్ఎంఎల్ ఖాదర్, స్వధార్ హోం నిర్వాహకులు సిస్టర్ హృదయమేరి, సిస్టర్ హిమాలి, సిస్టర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు


ఇంటర్‌లో చైతన్య విద్యార్థికి 466 మార్కులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తిరుపతిరావు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థి పూర్ణిమకు జూనియర్ బైపీసీలో 466 మార్కులు లభించాయని ప్రిన్సిపాల్ తిరుపతిరావు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. 54 మంది విద్యార్థులకు 460కి పైగా మార్కులు లభించాయి. జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను ఫాతిమా, దీపికలకు 430 మార్కులు లభించాయి. సీనియర్ ఎంపీసీలో బాలవర్షిణి 989, బైపీసీలో భవ్య 985 మార్కులు సాధించారని చెప్పారు. డీన్ చంద్రశేఖర్, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి పీఈటీ పరీక్ష సిలబస్

● డీఈవో రేణుక

ఎఫెక్ట్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయుల పరీక్ష సిలబస్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని డీఈవో రేణుక తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఈ అంశంపై ఆటలొద్దు.. పాఠాలు చాలు శీర్షికతో శనివారం వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. గత ప్రభుత్వం పీఈటీ పోస్టుల భర్తీకి పెట్టిన సిలబస్ స్కిల్ టెస్ట్ లేకుండా థియరీ నైపుణ్యం ఉండేలా మాత్రమే ప్రకటించి డీయస్సీ ఏర్పాటు చేసింది. కేవలం క్రీడా నైపుణ్యం లేకుండా పీఈటీలను భర్తీ చేస్తే విద్యార్థులకు క్రీడల్లో ఎలా ప్రావీణ్యం అందుతుందనే అంశంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. ఈ కథనాన్ని పరిశీలించిన డీఈవో లోపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సరిచేయిస్తామని అభ్యర్థులు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని వివరించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హరిప్రసాద్

మహిత కళాశాల విద్యార్థికి 986 మార్కులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో శ్రీరామా వారి శ్రీమహిత కళాశాల విద్యార్థి సూర్యవెంకట్ 986 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ హరిప్రసాద్ తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. మోనిషాకు 985, వీణానంద్‌కు 980, గీతికావాణి 980 మార్కులు సాధించగా, సీనియర్ బైపీసీలో సుషన్నారాణి 988, మాలిక్ 980 మార్కులు పొందారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో నేహాదుర్గా 466, మాన్య, రూపేష్ చంద్ర, లావణ్య 465, సానియా 464, అనిఫ్‌బాషా 461, జూనియర్ బైపీసీలో కావ్యబాయ్ 432, మంజూష 429 మార్కులు, ఎంఈసీలో స్నేహిత 490, ఉమాప్రియ 485 మార్కులు పొందారని చెప్పారు. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఇంటర్‌లో వైష్ణవి విద్యార్థిని రాజేశ్వరికి 986 మార్కులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థిని కె.రాజేశ్వరికి ఇంటర్ పరీక్షల్లో ఎంపీసీ విభాగంలో వెయ్యి మార్కులకు గాను 986 మార్కులు లభించాయి. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అభినందించారు. బైపీసీలో వెంకటలక్ష్మిశ్రీదుర్గకు 982 మార్కులు, జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను శిరీష, జానకీరామ్‌లకు 459 మార్కులు, బైపీసీలో 440కి గాను మేరి మహితకు 434 మార్కులు లభించాయి. ఎంఈసీ విభాగంలో తన్వితకు 478, సీఈసీలో కీర్తిచంద్రికకు 485 మార్కులు లభిచాయని తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 900లకు పైగా మార్కులను 54 మంది విద్యార్థులు, జూనియర్ ఇంటర్‌లో 400లకు పైగా మార్కులను 47 మంది విద్యార్థులు సాధించినట్లు ప్రకటించారు. అధ్యాపకులు వీరేంద్ర, బాబు, లలిత, షంషాద్ బేగం, మౌనిక, రోజీమేరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం


కల్యాణంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి వారు

తెనాలి రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడిలో కొలువుదీరి ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి రథోత్సవం కనులపండుగగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామి వార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో శాంతికల్యాణం నిర్వహించారు. శనివారం స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలతో భక్తుల నడుమ దివ్య రథోత్సవం అంగరంగవైభవంగా జరిపారు. గ్రామంలో రథోత్సవంగా వస్తున్న స్వామి వార్లను మహిళా భక్తులు నీరు వారపోసి టెంకాయలు సమర్పించి హారతులు పట్టారు. ఆలయ అర్చక స్వాములు, దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎనర్జీక్లబ్ ప్రదర్శన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వనరులను పొదుపుగా వినియోగించుకోవాలి

పొన్నూరుటౌన్(చేబ్రోలు), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతిమాత శక్తి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని నారాకోడూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు తెలిపారు. శనివారం పాఠశాలలో ఎనర్జీక్లబ్ ద్వారా శక్తివనరుల వినియోగంపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పోటీలు నిర్వహించారు. ర్యాలీలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎం వెంకటేశ్వరరావు, డీవీ శ్రీనివాస్, ప్రసాద్, ఉమామహేశ్వరి, కృష్ణారావు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని శనివారం నిడుబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాల, ఐదో వార్డు మున్సిపల్ హైస్కూల్, నేతాజీనగర్ హైస్కూళ్లలో రాజ్యాంగం, అంబేడ్కర్ అంశంపై వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించారు. బీఎస్పీ, అంబేడ్కర్ యూత్ నిడుబ్రోలు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతకు ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి సభలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు ఎద్దు శ్యాంమ్యూల్ రాజ్, యాతాటి కిశోర్ తెలిపారు.